

పల్లెను వీడి నగరం వైపు..
సంక్రాంతికి స్వగ్రామలకు వెళ్లినవారు పండుగ సెలవులు ముగియడంతో తిరుగుపయనం అయ్యారు. - 10లో



ముమ్మరంగా.. మున్సిపల్ భవనం
మోత్కూరులో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. - 11లో



గంజాయి రవాణాపై నిఘా
ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి గంజాయి రవాణా కాకుండా సాగర్ పోలీసులు పటిష్ట నిఘా పెట్టారు. - 12లో

న్యూస్‌రీల్

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

భువనగిరి : సంక్రాంతి సెలవులు ముగియడంతో గురువారం నుంచి అన్ని రకాల పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు డీఈఓ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారంతో సెలవులు ముగియడంతో ఆరు రోజుల తరువాత తిరిగి నేటి నుంచి విద్యార్థులు బడిబాట పట్టనున్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, వేద ఆశీర్వచనం తదితర పూజలు గావించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీ స్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి తదితరులు

రామన్నపేట : ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈఓ నారాయణరెడ్డి బుధవారం భువనగిరిలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. పలు సమస్యలను ఆ సంఘం నాయకులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు బోయ రాములు తెలిపారు.ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్, బొల్లెద్దు కరుణాకర్, పాల్వాయి వెంకటయ్య, జె.క్రిష్ణ, బొడ్డు హుస్సేన్, డి.నాగేష్, దళిత సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, మేడె రామక్రిష్ణ, లీలావతి, సంజీవ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

మాడుగులపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య రాజు అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ నెలాఖరుతో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుండడంతో వారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుమలత, జడ్పీటీసీ సభ్యుడు పుల్లెంల సైదులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, సర్పంచులు, ఎంపీటీసీలు తహసీల్దార్ జమీరొద్దీన్, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవికుమార్, ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వైద్య కళాశాల

ఈ విద్యా సంవత్సరం నుంచే ఎంబీబీఎస్ తరగతులు

- తాత్కాలికంగా ప్రైవేట్ భవనాల్లో కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రిన్సిపాల్ నియామకం
- శాశ్వత నిర్మాణాల కోసం మల్లాపురంలో 20 ఎకరాల స్థలం కేటాయింపు



మల్లాపురంలో మెడికల్ కళాశాల కోసం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి, యాదాద్రి : జిల్లా వైద్య కళాశాల ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్న నేపథ్యంలో తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్య కళాశాల ప్రభుత్వం మొత్తం 50 ఎంబీబీఎస్ సీట్లను కేటాయించింది. వైటీడీఏ పరిధిలో గల యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించారు. ప్రిన్సిపాల్‌గా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ శ్రవణ్‌కుమార్‌ను ఈనెల 12న ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మెడికల్ కళాశాలకు మల్లాపురంలో కేటాయించిన స్థలానిన ఇటీవల పరిశీలించారు. అలాగే కళాశాల ప్రారంభించడానికి అనువైన భవనాలను పరిశీలన చేయనున్నారు.

20 ఎకరాల స్థలం కేటాయింపు

జిల్లాకో మెడికల్ కళాశాలలో భాగంగా గత ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరు చేసింది. అయితే యాదాద్రి పుణ్యక్షేత్రానికి సమీపంలోని మల్లాపురంలో సర్వే నంబర్ 64లో 20 ఎకరాల స్థలాన్ని కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించింది. మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు ఇతర అవసరాల కోసం గతంలోనే రూ.182 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు యాదాద్రికి వచ్చే భక్తుల వైద్య అవసరాల నిమిత్తం యాదగిరిగుట్టలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి పెంచుతానని ప్రకటించారు. ఈమేరకు గత సంవత్సరం ఫిబ్రవరిలో వైటీడీఏ పరిధిలోని కొండకు పక్కన గల సైదాపురం రెవెన్యూలో ఐదెకరాల స్థలం కేటాయించారు. అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి కేటీఆర్ ఆస్పత్రికి ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు.రోగులకు అనువుగా లేదన్న కారణం చూపుతూ మరో చోట 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలోనే నూతనంగా జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడంతో మల్లాపురం శివారులో 20ఎకరాల స్థలాన్ని కేటాయించారు.

తొలుత 50 పడకలతో ప్రారంభం

తొలుత 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను త్వరలో ప్రారంభించే అవకాశం ఉంది. అయితే 100నుంచి 150 సీట్లతో కూడా కళాశాలను ప్రారంభించే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం ఎలాంటి భవనాలు నిర్మాణం కాలేదు. ఈ క్రమంలో కొత్త కళాశాల భవన సముదాయం పూర్తి చేసే వరకు కళాశాలను నడుపడం కోసం తాత్కాలికంగా ప్రభుత్వ లేదా ప్రైవేట్ భవనాల్లో వైద్యవిద్య తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. వాటి కోసం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు అన్వేషణలో ఉన్నారు. ఇందులో భాగంగా మూతపడిన ఇంజనీరింగ్ కళాశాలలు, భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి, పాత కలెక్టరేట్ భవన సముదాయం, ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను పరిశీలిస్తున్నారని సమాచారం.

ప్రభుత్వానికి నివేదిక

మెడికల్ కళాశాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ శ్రవణ్‌కుమార్, డీసీహెచ్ డాక్టర్ చిన్నానాయక్, ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులైన సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్, కిషోర్‌కుమార్, యాదగిరిగుట్ట తహసీల్దార్ కృష్ణ, ఆర్‌ఐ విజయసింహారెడ్డిలు మల్లాపురంలో ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని ఇటీవల పరిశీలించారు. అలాగే జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉన్న వైద్య సౌకర్యాలు, రోగుల సంఖ్య వారికి అందుతున్న సేవలు, బెడ్‌ల వివరాలను పరిశీలించారు. వచ్చే వైద్య విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమయ్యే తరగతుల కోసం అవసరైన మౌలిక సదుపాయాల వివరాలను ప్రభుత్వానికి, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు నివేదికను పంపించి వారి ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని యాదాద్రి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ 'సాక్షి'తో చెప్పారు.

దయాకర్‌కు షాక్!

- ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసి.. చివరి క్షణంలో తప్పించిన అధిష్టానం
- సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు విఫలం
- అద్దంకి దయాకర్ స్థానంలో మహేష్ కుమార్‌గౌడ్ పేరు ఖరారు
- పార్టీ కోసం సహనంతో ఉండాలని అనుచరులకు దయాకర్ పిలుపు



అద్దంకి దయాకర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి వచ్చినట్లే వచ్చి చేజారిపోయింది. ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులను మంగళవారం కాంగ్రెస్ అధిష్టానం దాదాపుగా ఖరారు చేసింది. అందులో భాగంగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను నామినేషన్ కోసం పత్రాలు సిద్ధం చేసుకోమని చెప్పి.. ఆ తర్వాత మళ్లీ వద్దంటూ ఫోన్ చేసి షాకిచ్చింది. అంతేకాదు దయాకర్ స్థానంలో మహేష్‌కుమార్ గౌడ్ పేరును ప్రకటించడంతో దయాకర్ అనుచరులు నిరుత్సాహంలో పడ్డారు. ఇప్పుడు మరేదైనా పదవి ఇస్తారా? గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం వస్తుందా? అన్న చర్చ సాగుతోంది.

సీఎం రేవంత్‌కు సన్నిహితుడిగా..

తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన అద్దంకి దయాకర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీలో చేరి నియోజకవర్గంలో పనిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటూ వచ్చారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి అద్దంకి దయాకర్‌కే టికెట్ ఇస్తారని ఆయన వర్గీయులు భావించారు. అక్కడ మందుల సామేల్‌ను పోటీలో నిలిపితే విజయం సులభం అవుతుందన్న పార్టీ నిర్ణయం మేరకు సామేల్‌కే టికెట్ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, మంచి అవకాశం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు అధిష్టానం కూడా దయాకర్‌కు నచ్చజెప్పింది. రేవంత్‌తో కలిసి దయాకర్ కాంగ్రెస్ బహిరంగ సభల్లో పాల్గొని ప్రచారం నిర్వహించారు.

చేజారిన పదవి : పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విధేయుడిగా ఉంటూ వస్తున్న దయాకర్‌కు ఎమ్మెల్సీ లేదా ఏదైనా పెద్ద పదవి లభిస్తుందని ఆయన అనుచరులు భావించారు. అనుకున్న విధంగా ఎమ్మెల్సీ అవకాశం ఇస్తున్నట్టు చెప్పి.. నామినేషన్ వేసేందుకు పత్రాలు సిద్ధం చేసుకోవాలని ఫోన్ ద్వారా సమాచారం అందించింది. దీంతో ఆయన అందుకు రెడీ అయ్యారు. ఈలోగా అధిష్టానం మహేష్‌కుమార్‌గౌడ్ పేరును ముందుకు తీసుకొచ్చి ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంత ప్రయత్నం చేసినా ఫలించలేదన్న చర్చ సాగుతోంది.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా

- అద్దంకి దయాకర్

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలో పార్టీ తీసుకున్న నిర్ణయంతో కొంత ఇబ్బంది కలిగి ఉండవచ్చు. పార్టీ కోసం సహనంతో ఉందాం. పార్టీ నాకు మరింత పొజిషన్ ఇవ్వాలని ఆలోచించి ఉండవచ్చు. ఇది రాకపోవడం వల్ల అద్దంకి దయాకర్‌పై కుట్ర జరిగిందని, నష్టం చేశారని భావించవద్దు. అది వాస్తవం కాదు. రాష్ట్ర పార్టీ, కేంద్ర పార్టీ నా పట్ల సానుకూలంగా ఉన్నాయి. రాష్ట్ర ఇన్‌చార్జి కూడా నాతో మాట్లాడారు. పార్టీ విధేయునిగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిన బాధ్యత నాపై ఉంది. మంచి జరగబోతుంది. అందరూ సంతోషంగా ఉండండి. పార్టీ అధికారంలోకి వచ్చింది. దయాకర్‌కు పదవి ఇవ్వడమనేది పార్టీకి చాలా చిన్న విషయమే. దీన్ని పెద్దగా చూడకుండా పార్టీ భవిష్యత్‌ను ఆలోచించే వారముగా మనందరం కూడా కలిసి ప్రజాపాలనను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. మంత్రులందరికీ సహకరించాలి.

అమ్మకు పరీక్ష!

- భువనగిరిలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌లో స్కానింగ్, వైద్య పరీక్షలకు జాప్యం
- గంటల తరబడి నిరీక్షణ
- గర్భిణుల అవస్థలు



డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిరీక్షిస్తున్న గర్భిణులు

భువనగిరి : జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన టి-డయాగ్నోస్టిక్ సెంటర్‌కు రద్దీ పెరిగింది. కానీ, సకాలంలో పరీక్షలు నిర్వహించకపోవడంతో గంటల తరబడి నిరీక్షించవలసి వస్తుంది. బుధవారం జిల్లా కేంద్ర ఆస్పత్రికి పెద్ద సంఖ్యలో గర్భిణులు వచ్చారు. స్కానింగ్, పరీక్షల చేయించుకోవాలని వైద్యులు సూచించడంతో 40 నుంచి 48 మంది వరకు టి-డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లారు. కాగా రేడియాలజిస్ట్ ఉదయం 11గంటలకు వచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుమారు 30మందికి స్కానింగ్ చేశారు. అనంతరం బయటకు వెళ్లారు. ఇంకా 18 మంది గర్భిణులు కేంద్రంలోనే ఉండిపోయారు. రేడియాలజిస్ట్ ఎంతకు రాకపోవడంతో ఉదయం నుంచి ఎలాంటి ఆహారం తీసుకోకుండా గంటల తరబడి నిరీక్షిస్తున్న గర్భిణులు ఆగ్రహంతో వైద్య సిబ్బందిని నిలదీశారు. కొంతమంది ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లారు. మధ్యాహ్నం 2.20 గంటలకు రేడియాలజిస్ట్ వచ్చి స్కానింగ్ చేయడం గమన్హారం.

కందులు క్వింటా రూ.8,500

- బహిరంగ మార్కెట్‌లో ఫుల్ డిమాండ్
- ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికం
- ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు
- 3,340 ఎకరాల్లో కంది సాగు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కందులు

భువనగిరి : కంది బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ. 8,500 పలుకుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి అమ్ముడు పోతుండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. జిల్లాలో సుమారు 1,500 మంది రైతులు 3,340 ఎకరాల్లో కంది సాగు చేశారు. ఎకరానికి ఆరు క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది క్వింటా రూ.6,300 మద్దతు ధర పలకగా ఈసారి రూ.7000కి పెంచింది. బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి అదాయం కళ్ల చూస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేనా?

కంది పంట చేతికొస్తుండడంతో ఇప్పటికే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.కానీ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. అంతేకాకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లోనే ఎక్కువగా ఉండడంతో రైతులు ప్రైవేట్‌కు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందా.. లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. దీంతో రైతులు వ్యాపారులకే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనిని అసరాగా చేసుకుని వ్యాపారులు కల్లాల వద్దనే కందులను కొనుగోలు చేస్తున్నారు. కాగా వ్యాపారులకు విక్రయిస్తే ధర ఎక్కువ వచ్చినా తూకం, తరుగులో తేడా ఉండే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేలా వ్యాపారులతో పోటీపడి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నిర్ణయించడంతో ధర మరింత పెరిగి రైతులకు మేలు జరిగే అవకాశం లేకపోలేదు.

అవసరమైతేనే కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో కంది సాగు చేశారు. అవసరాన్ని బట్టి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం దీనిపై ఎలాంటి స్పష్టత లేదు. కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ వస్తే తప్పనిసరిగా ఏర్పాటు చేస్తాం.

– జ్యోతి, మార్క్‌ఫెడ్ మేనేజర్, నల్లగొండ

తగ్గిన సాగు

గత సంవత్సరంలో జిల్లాలో సుమారు 8 వేల ఎకరాల్లో కంది సాగు చేయగా ఈ సారి 3340 ఎకరాల్లో చేశారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు అధికారులు అవగాహన కల్పించినా ఫలితం లేకపోయింది. వరి సాగు చేయడం సులభంగా ఉంటుందని భావించడంతో పాటు తెగుళ్ల భయం, వాతావరణం సహకరిస్తుందో లేదోనని కంది సాగు చేయడం లేదు. దీంతో ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. ఫలితంగా కందులకు డిమాండ్ ఏర్పడడంతో ధర కూడా పెరిగింది.

ఉత్కంఠగా భువనగిరి రాజకీయం

- అవిశ్వాసంపై తగ్గేది లేదంటున్న కౌన్సిలర్లు
- నేడు బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లతో సమావేశం కానున్న పైళ్ల శేఖర్‌రెడ్డి
- చైర్మన్, వైస్ చైర్మన్ రాజీనామా చేసే అవకాశం



మున్సిపల్ కార్యాలయం

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపల్ రాజకీయం ఆసక్తిరేపుతోంది. చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఈనెల 23న అవిశ్వాసం మీటింగ్ ఉన్నందున బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లతో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి బుధవారం మాసుకుంటలో సమావేశం కానుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈనెల 16వ తేదీనే సమావేశంలో ఉండగా ఇద్దరు కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో నేటికి వాయిదా వేశారు. అయితే చైర్మన్, వైస్ చైర్మన్‌లను మార్చే విషయమై సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సమావేశం అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమ పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉందని సమాచారం. ఇందుకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కూడా సుముఖంగా ఉన్నారని, రాజీనామా లాంచనమేనని ప్రచారం జరుగుతోంది.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 20 మంది.. భువనగిరి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ 15 సీట్లు గెలుచుకుంది. ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన కౌన్సిలర్ల బీఆర్‌ఎస్ బలం 20 మందికి చేరింది. అయితే చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఖాజాఅజీమ్‌వుద్దీన్ నేతృత్వంలో16 మంది కౌన్సిలర్లు తిరుగుబాటు చేసి అవిశ్వాసం నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. తిరుగుబాటు చేసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు కాంగ్రెస్ 9, బీజేపీ కౌన్సిలర్లు ఆరుగురు మద్దతుగా నిలవడంతో 31 మందికి చేరింది. వీరంతా సంతకాలతో కూడిన తీర్మానపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఈనెల 23న అవిశ్వాసం మీటింగ్ నిర్వహిస్తామని కౌన్సిలర్లకు కలెక్టర్ నోటీసులను జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా నేడు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల సమావేశం ఉండడంతో ఏం జరగనుందోనన్న చర్చ జరుగుతోంది.

'బీబీపేట్ తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి'

మోత్కూరు : కామారెడ్డి జిల్లా బీబీపేట్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన తహసీల్దార్ సత్యనారాయణను సస్పెండ్‌చేయాలని వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కో చైర్మన్ దాసరి వీరన్న డిమాండ్ చేశారు. బుధవారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ పూర్వపు వీఆర్‌ఏలందరికీ ఐడీలు ఇచ్చి జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.అందరి పేర్లు రెఫర్ చేసి శ్రీకాంత్ పేరు తొలగించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

యాదగిరిగుట్ట : కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు మద్దతు తెలుపుతూ బుధవారం యాత్ర స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో మాదిరిగానే కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.



తన వాహనానికి భారత్ జోడో యాత్ర స్టిక్కర్ వేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

గురుకులం పిలుస్తోంది

- మైనార్టీ గురుకుల పాఠశాలలు, కాలేజీల్లో ప్రవేశాలు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



భువనగిరిలోని గురుకుల పాఠశాల

భువనగిరిటౌన్ : మైనార్టీ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం రాష్ట్ర మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూసన్ సొసైటీ(టీఎంఆర్‌ఈఐఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. 5, 6, 7, 8 తరగతులతోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు.

భర్తీ చేయనున్న సీట్లు ఇలా..

5వ తరగతిలో ఒక్కో స్కూల్‌లో 80 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నారు. ఇంటర్ ఒక్కో దాంట్లో 80 చొప్పున 180 సీట్లు భర్తీ చేయనున్నారు. ముస్లిం, క్రిస్టియన్, పార్శీ, జైన్, సిక్కులతో పాటు మైనార్టీయేతర ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మైనార్టీలకు మొదట వచ్చిన వారికి మొదటి సీటు ప్రాతిపదికన, మిగతా వారికి లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయించనున్నారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఇంటర్‌తోపాటు ఐఐటీ/జేఈఈ, నీట్, ఎంసెట్, తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తారు. కాలేజీల్లో ఇంటర్ మొదటి ఏడాదికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. 10 తరగతిలో వచ్చిన జీపీఏ పాయింట్ల ఆధారంగా కాలేజీల్లో సీట్లు ఇస్తారు. ఆసక్తి ఉన్న వారు http://tmreir.telangana.gov.in లేదా మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ నంబర్లను సంప్రదించవచ్చు

భువనగిరి (బాలుర)	73311 70858
చౌటుప్పల్ (బాలుర)	79950 57989
ఆలేరు (బాలికలు)	99505 7988

వివరాలు..

5వ తరగతిలో రెగ్యులర్ అడ్మిషన్లతో పాటు 6,7,8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీ చేయనున్నారు.

అర్హతలు : 5వ తరగతిలో ప్రవేశాలకు 2012 సెప్టెంబర్ 1 –2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి

- 6వ తరగతిలో 2011 సెప్టెంబర్ 1–2014 ఆగస్టు 31 మధ్య
- 7వ తరగతిలో 2010 సెప్టెంబర్ 1–2013 ఆగస్టు 31 మధ్య
- 8వ తరగతిలో 2009 సెప్టెంబర్ 1–2012 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

సద్వినియోగం చేసుకోవాలి

మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలి. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం కోరుతున్నాం.

– యాదయ్య, జిల్లా మైనార్టీ సంక్షేమ ఇన్‌చార్జ్ అధికారి

కళాశాలల్లో(జనరల్, ఒకేషనల్)

అర్హత: ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కోరువారు టెన్త్ ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. కనీసం 6 జీపీఏ ఉండాలి.

వయో పరిమితి: 2024 ఆగస్టు 31 నాటికి 18 సంవత్సరాలకు మించి ఉండరాదు.

వార్షిక ఆదాయం: గ్రామీణ అభ్యర్థులకు రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.2 లక్షలకు మించకూడదు. దివ్యాంగులకు, ఎక్స్-సర్వీస్‌మెన్ పిల్లలకు ఎలాంటి పరిమితి లేదు.

క్లుప్తంగా

కారును ఢీకొట్టిన రెండు బస్సులు


నుజ్జునుజ్జయిన కారు

నాగార్జునసాగర్: ఓ కారును రెండు బస్సులు ఒకదాని తర్వాత మరొకటి ఢీకొట్టాయి. ఈ ఘటన నాగార్జునసాగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మాచర్లకు వెళుతోంది. రాంగ్‌రూట్‌లో వచ్చి బుద్ధవనం దాటాక రెండవ డౌన్ మూల మల్పు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. కారు వెనుక నుంచి వస్తున్న మరో బస్సు అదే కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆ వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. కారులో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆంధ్రావైపు నుండి విధులు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలకు చెందిన కమాండెంట్ ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. ఎలాంటి ప్రాణాపాయం కలుగక పోవడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీస్టేషన్‌కు తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజాపేట : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి బుధవారం రాత్రి తెలిపారు. మండలంలోని సోమారం గ్రామం నుంచి పుట్టగూడెం గ్రామం వైపు అశోక్ లీలాండ్ వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా బొందుగుల గ్రామ పంచాయతీ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. పుట్టగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి సుమారు 49 క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నకిరేకల్: నకిరేకల్‌ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్–1 గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారరు. ఆసక్తి, అర్హత కలవారు ఈ నెల 20వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 22వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. నీట్, సెట్, పీహెచ్‌డీతో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులు చేసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పీజీలో 50 శాతం, ఓసీ, బీసీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలని సూచించారు.

కుక్కల దాడిలో నెమలి మృతి

యాదగిరిగుట్ట: కుక్కల దాడిలో నెమలి మృతిచెందింది. ఈ ఘటన యాదాద్రి ఆలయ కొండకు దిగువలో గల బస్ స్టేషన్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారులు, స్థానికులు గుజ్జ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి కొండ కింద ఆలయ నూతన బస్ స్టేషన్ చెంతకు రోజు మాదిరిగానే నెమలులు ఆహారం కోసం వచ్చాయి. దీంతో అక్కడే ఉన్న కుక్కలు ఓ నెమలిపై ఒక్కసారిగా దాడికి దిగాయి. కుక్కలు ఒక్క సారిగా మీద పడి దాడి చేయడంతో నెమలి అక్కడికక్కడే మృతి చెందింది. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన నెమలిని ఖననం చేస్తామని తెలిపారు.

పల్లెను వీడి నగరం వైపు..


చౌటుప్పల్‌లో హైవేపై హైదరాబాద్ మార్గంలో బారులుదీరి వెళ్తున్న వాహనాలు


సూర్యాపేటలోని జనగామ క్రాస్‌రోడ్ వద్ద వాహనాల రద్దీ ఇలా


సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు


చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై ఆగిపోయిన వాహనాన్ని పక్కకు తోస్తున్న ట్రాఫిక్ పోలీస్

- హైవేపై తిరుగు ప్రయాణపు రద్దీ
- హైదరాబాద్ మార్గంలో బారులుదీరిన వాహనాలు
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద 12టోల్ బూత్‌లు హైదరాబాద్ వైపునకు కేటాయింపు

చౌటుప్పల్ : హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం సైతం రద్దీ కొనసాగింది. సంక్రాంతి పండుగకు సొంతూర్లకు వెళ్లిన ప్రజలంతా హైదరాబాద్ వైపునకు తిరుగు ప్రయాణం కట్టారు. దీంతో హైవేపై వాహనాలు బారులుదీరాయి. ఇప్పటికే పండుగ ముగియడం, విద్యాసంస్థలకు సెలవులు పూర్తవ్వడంతో భారీ సంఖ్యలో తిరిగివస్తున్న క్రమంలో రద్దీ పెరిగింది. మధ్యాహ్నం తర్వాత సాయంత్రం నుంచి రద్దీ ఒక్కసారిగా అధికమయ్యింది. అందులో భాగంగా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. హైవేపైకి జంక్షన్ల వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా యూటర్న్ జరగకుండా స్టాపర్‌లను ఏర్పాటు చేశారు. అదే విధంగా పండుగ రద్దీతో ఆర్టీసీ బస్సులు, ప్రయాణ ప్రాంగణాలు, ప్రైవేటు వాహనాల్లోనూ జనం రద్దీ ఏర్పడింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16కు గాను 12టోల్ బూత్‌లను హైదరాబాద్ వైపునకు కేటాయించారు. టోల్‌బూత్‌ల వద్ద ఎక్కువసేపు వాహనాలు నిల్చోకుండా తగిన చర్యలు తీసుకున్నారు. సాధారణ రోజుల్లో 30–35వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా బుధవారం రోజున అదనంగా మరో 15వేల వాహనాలు వెళ్లే అవకాశాలు ఉంటాయని టోల్ సిబ్బంది అంచనా వేస్తున్నారు. కాగా హైవేపై రద్దీ కారణంగా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు.

సూర్యాపేట : సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణాలు, ఇతర ఊళ్లలో ఉండే వారు తమ సొంత గ్రామాలకు పండుగకు వెళ్లారు. పండుగ ముగియడంతో మళ్లీ తిరుగుబాట పట్టారు. దీంతో విజయవాడ హైదరాబాద్ వెళ్లే రహదారి వివిధ వాహనాలతో రద్దీగా మారింది. అలాగే బస్టాండ్లలో ప్రయాణికులు కిటకిటలాడుతున్నారు. బుధవారం రోజు రహదారులు వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి.

కొనసాగుతున్న వాహనాల రద్దీ

బీబీనగర్ : సంక్రాంతి పండుగకు జంట నగరాల నుంచి గ్రామాలకు తరలి వచ్చిన ప్రజలు పండుగ సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణంతో రహదారులు రద్దీగా మారాయి. మండలంలోని జాతీయ రహదారిపై వాహనాలు కిక్కిరిసిపోగా గూడూరు టోల్‌ప్లాజా వద్ద రాత్రి కిలో మీటర్ మేర రద్దీ నెలకొంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం అవుతుండడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి.


హైదరాబాద్ వైపు నిలిచిన వాహనాలు

భువనగిరిలో...

భువనగిరి : సంక్రాంతి సెలవులు ముగియడంతో పిల్లలతో కలిసి స్వగ్రామాలకు వెళ్లిన ప్రయాణికులు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో బుధవారం వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారి పై వాహనాల రద్దీ పెరిగింది. అలాగే భువనగిరి బస్టాండ్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సులు సకాలంలో రాకపోవడంతో పాటు కిక్కిరిసి వస్తుండడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు.


భువనగిరిలో వరంగల్ – హైదరాబాద్ రహదారిపై వాహనాల రద్దీ

రెండు కార్లు ఢీ.. పలువురికి గాయాలు


బోల్తాపడిన కారు

మునగాల: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. మునగాలలో చోటు చేసుకున్న ఈ ఘటన మునగాలలో బుధవారం చోటు చేసుకుంది. నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన రామిని సతీష్‌రెడ్డి తన కుటుంబంతో పాటు స్నేహితుడు బత్తుల శేఖర్ అతని భార్య అపూర్వలతో కలసి కారులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గ మధ్యలో మునగాల వద్ద కారు మరమ్మతుకు గురవ్వడంతో పక్కకు నిలిపారు. ఎన్టీఆర్ జిల్లా ముదినేపల్లి మండలం నారాయణపురం గ్రామం నుంచి కాసెట్టి సతీష్, కాసెట్టి వెంకటరమణ, మోక్ష, లీలా వెంకటలక్ష్మి కారులో హైదరాబాద్‌కు వెళుతూ మునగాల వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బత్తుల శేఖర్, అపూర్వ, సృజన, వెంకటరమణ, సతీష్, మోక్షలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో బత్తుల శేఖర్, వెంకటరమణల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా రోడ్డు పక్కన నిలిచి ఉన్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టడంతో ముందున్న కారు ఎగిరి ముందుకు వెళ్లి పల్టీ కొట్టింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన డ్రైవర్ సతీష్

వేర్వేరు కారణాలతో ఇద్దరి బలవన్మరణం

భువనగిరి క్రైం : వేర్వేరు కారణాలతో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. భువనగిరి పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని హుస్సేన్‌బాద్‌కు చెందిన వల్దాస్ బాలరాజు (18) స్థానికంగా ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సీతానగర్ సమీపంలోని ఓ వెంచర్‌లో పురుగుల మందు తాగి పడి పోయాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంజారాహిల్స్‌లో...

భువనగిరి పట్టణంలోని బంజారాహిల్స్ కాలనీలో నివాసం ఉంటున్న నాగిళ్ల ఈదయ్య(50) వ్యవసాయ శాఖలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. బంజారాహిల్స్ కాలనీలో భార్యతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన ఈదయ్య బుధవారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారును కి.మీ దూరం నెట్టుకెళ్లి..

- ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించిన పోలీసులు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో హైవేపై బుధవారం చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును బైక్ ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కారు హైవేపై అడ్డంగా నిలిచిపోయింది. ఘటన స్థలాన్ని చౌటుప్పల్‌కు చెందిన ఏఎస్‌ఐ సత్యనారాయణ, కానిస్టేబుల్ అనిల్‌కుమార్ పరిశీలించారు. రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయాన్ని నివారించేందుకు ఏఎస్‌ఐ, కానిస్టేబుల్ ఆ కారును కి.మీ దూరం నెట్టుకుంటూ వెళ్లి వాహనాన్ని పక్కకు నిలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు.


గుండ్రాంపల్లి శివారులో కారును వెనక నుంచి తోస్తున్న పోలీసులు

వివాహిత అదృశ్యం

నిడమనూరు: వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన నిడమనూరు మండలంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మార్లగడ్డ క్యాంపునకు చెందిన కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,ధనలక్ష్మి దంపతులు. వీరికి వివాహమైన కుమార్తె, సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్న కుమారుడు ఉన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు కిరాణ సామగ్రి తేవడానికని శ్రీనివాస రెడ్డి నిడమనూరుకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి భార్య ధనలక్ష్మి లేకపోవడాన్ని గమనించాడు. గ్రామంలో తెలిసిన వారిని, బంధువులను, భార్య తల్లి గారి గ్రామం రాజన్నగూడెంలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో శ్రీనివాసరెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు.


ధనలక్ష్మి (ఫైల్)

మోసగించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

అడ్డగూడూరు : మోసగించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం రామన్నపేట కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామానికి చెందిన తుమ్మల వెంకట్‌రెడ్డికి గ్రామ శివారులో తనకున్న 20గుంటల భూమిని 2008వ సంవత్సరంలో తన కుమారుడిపై రిజిస్ట్రేషన్ చేశాడు. తిరిగి అదే భూమిని 2014లో తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన డి. వెంకటలక్ష్మారెడ్డికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. కొద్ది రోజుల్లోనే బాధితుడికి మోసం తెలియడంతో కోర్టును ఆశ్రయించాడు. తుమ్మల వెంకట్‌రెడ్డి రెండో సారి భూమిని రిజిస్ట్రేషన్ చేసి మోసగించాడని నేరం నిరూపణ కావడంతో మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆన్‌లైన్ యాప్‌తో మోసపోవద్దు

నల్లగొండ క్రైం: ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని జిల్లా ఎస్పీ చందనా దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్లకు మోసపూరితమైన లింక్‌లు పెట్టడంతో పొరపాటున క్లిక్ చేయడం ద్వారా మోసపోతామని, అధిక వడ్డీ వస్తుందని, రెట్టింపు సొమ్ము ఇస్తామని మోసం చేస్తారని వివరించారు. టెక్నాలజీని ఆసరాగా చేసుకుని ప్రజలను అధిక వడ్డీ ఆశ చూపి బురిడీ కొట్టించే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వైద్య సహాయం, పేరు పొందిన కంపెనీల్లో ఉద్యోగాల పేరిట సులభంగా నమ్మించి మోసాలు చేస్తుంటారని తెలిపారు. ఎలాంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదని, మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైం పోలీసులను సంప్రదించాలని సూచించారు. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ, 155260కి గానీ ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మరో నలుగురికి తీవ్ర గాయాలు

నూతనకల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. నూతన్‌కల్, మోతె, మోటకొండూరు మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌బాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన తూర్పాటి గణేష్(23), పెండెం శ్రీను, దానబోయిన సమ్మయ్య, రోహిత్‌లు మంగళవారం ఆత్మకూర్(ఎస్)మండలం ముక్కుడుదేవులపల్లిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు ముగిసిన తర్వాత రాత్రి పల్సర్ బైక్‌పై నలుగురు స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నూతన్‌కల్ మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద తొర్రూర్ నుంచి సూర్యాపేట వైపు వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న గణేష్ అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ముగ్గురితో పాటు కారు డ్రైవర్ శ్రీనుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ నరేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా పడి..

మోతె : మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన ఆవుదొడ్డి సాలమ్మ కుమారుడైన గణేష్(23) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పండుగ నేపథ్యంలో మద్యం సేవించాడు. గ్రామంలోనే మద్యం మత్తులో ఆటో నడుపుతూ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ప్రమాదంలో ఆటో నడుతుపుతున్న గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఏడు నెలల కుమారుడు, తల్లి ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నికోలస్ తెలిపారు.


గణేష్ (ఫైల్)

కారు ఢీకొని..

మోటకొండూర్: మండలంలోని చాడ గ్రామానికి చెందిన ముస్త్యాల ముత్తమ్మ (60) తన కూతురి గ్రామం అయిన సుంకిశాలకు వెళ్లి బుధవారం తిరిగి వస్తోంది. ఈ క్రమంలో రాత్రి కాటేపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా రాయగిరి వైపు నుంచి మోత్కూర్ వైపునకు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయమై ముత్తమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తేజంరెడ్డి తెలిపారు.


ముత్తమ్మ (ఫైల్)

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి తీవ్ర గాయాలు

తుంగతుర్తి: ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన తుంగతుర్తి మండలంలోని ఏనెకుంటతండాలో బుధవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఏనెకుంటతండాకు చెందిన బానోతు అమ్మ ఇంట్లో గ్యాస్ వెలిగిస్తున్న సమయంలో పైపు లీకేజీతో సిలిండర్ పేలింది. అదే సమయంలో అక్కడ ఉన్న బానోతు అమ్మ, బానోతు జయలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తుంగతుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు.

గుండెపోటుతో తాటిచెట్టు పైనే గీత కార్మికుడు మృతి


మోత్కూరు : గుండెపోటుతో తాటి చెట్టు పైనే ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు సూదగాని లక్ష్మయ్య (70) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో చెట్టుపైనే మృతిచెందాడు. సమాచారం మేరకు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఫైర్ ఎస్‌ఐ సాయిదీపక్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు క్రేన్ సహాయంతో లక్ష్మయ్య మృతదేహాన్ని చెట్టుపై నుండి కిందకు దించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.


సూదగాని లక్ష్మయ్య మృతదేహం

జింక్ లోపం నివారిస్తేనే అధిక దిగుబడులు

- యాసంగి వరి పంటకు జింక్ వాడకం తప్పనిసరి
- గుర్రంపోడు ఏఓ కంచర్ల మాధవరెడ్డి


వరిలో జింక్ లోపంతో ఎర్రబారిన ఆకులు



గుర్రంపోడు : పంటల పోషకాల యాజమాన్యంలో సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గిపోతుండటం దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రసాయన ఎరువుల్లో ముఖ్య పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఉండటం, సూక్ష్మపోషకాలు లేకపోవడం వల్ల దీర్ఘకాలికంగా రసాయన ఎరువుల మీద ఆధారపడి సాగు చేసే నేలల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఏర్పడతాయి. తక్కువ పరిమాణంలోనే అవసరమయ్యే జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర పోషకాలు పైరు ఎదుగుదలకు, మంచి దిగుబడులకు దోహదపడతాయి. వరి మాగాణుల్లో ఏర్పడే ముఖ్యమైన జింక్ లోప నివారణకు గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి అందిస్తున్న సలహాలు ఆయన మాటల్లోనే..

వరిలో జింక్ లోపానికి కారణాలు

వరిలో జింకు లోపం అధికంగా రావడానికి ముఖ్య కారణం సేంద్రియ ఎరువుల వినియోగం తక్కువగా ఉండటమే. వరి సాగుకు ముందు పెసర, అలసంద, జీలుగ లాంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి నేలలో కలియ దున్నుతున్నారు. ఇది మినహా సేంద్రియ ఎరువుల వినియోగం వరిలో అత్యధిక విస్తీర్ణంలో లేనట్లే. మరో ముఖ్య కారణం వరిసాగు చేసే నేలల్లో చౌడు ఉండటం. చౌడు వల్ల నేలల్లో ఉన్న జింకు మొక్కలకు సులభంగా అందుబాటులోకి రాదు. దీంతో పైరులో జింకు లోపం ఏర్పడుతుంది.

దిగుబడులపై ప్రభావం

జింకు లోపం ఉంటే ఏ పంటలోపైనా రసాయన ఎరువులు తీసుకునే శక్తి తగ్గిపోయి వేసిన ఎరువులు వృథా అవుతాయి. వరిలో వచ్చే జింకు లోపం పంట పెరుగుదల, దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. జింకు లోపం ఉన్నప్పుడు నాటిన పైరు అనారోగ్యంగా కనిపిస్తుంది. పిలకలు తక్కువగా ఆలస్యంగా వస్తాయి. అంతేగాక వచ్చిన పిలకలు సరిగా పెరగక పైరు కృశించినట్లు, గిడసబారి కనిపిస్తుంది. లేత ఆకులు ఈనెల మధ్య భాగం పసుపు రంగులోకి మారిపోయి, పైరు కళ తప్పి కనిపిస్తుంది. జింకు లోపం తీవ్రత అధికంగా ఉన్న చోట్ల అడుగు ఆకులు ఎండిపోతాయి. ఇలా పైరు పెరుగుదలకు ఇబ్బంది కలిగి దిగుబడులు తగ్గుతాయి.

నివారణ చర్యలు

జింకులోప నివారణకు పంటకు అవసరమైన పోషకాల్లో కనీసం 30శాతం సేంద్రియ ఎరువుల ద్వారా అందించాలి. పశువుల ఎరువును తప్పనిసరిగా తోలించడం, ఇతర జీవన ఎరువులను వాడాలి. వీలు కానప్పుడు వరి నాటడానికి ముందు ఎకరాకు 20కిలోల వంతున జింకు సల్ఫేట్ దమ్ములో వేయాలి. జింకు సల్ఫేట్ దమ్ములో వేసినప్పుడు భాస్వరపు ఎరువులలో కలిపి వేయరాదు. జింకు సల్ఫేట్ వేయడానికి ముందు, తర్వాత రసాయన ఎరువులు వేయడానికి నాలుగు రోజుల విరామం ఉండాలి. జింకు సల్ఫేట్‌ను ఖరీఫ్, రబీ పంటలకు కలిపి ఒకసారి వేస్తే సరిపోతుంది.

వరి నాటేసిన తర్వాత..

దమ్ములో జింకు సల్ఫేట్ వేయని పొలాల్లో పైరుపై జింకు సల్ఫేట్ పిచికారీ చేయాలి. వరి నాటిన 20 రోజులకు ఒకసారి, మళ్లీ వారం వ్యవధిలో మరోసారి ఎకరానికి 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలి. పదిహేను రోజుల వ్యవధిలో మరోధఫా ఇదే మోతాదును పిచికారీ చేసుకోవాలి. జింకు సల్ఫేట్‌ను వరి పొలంలో పిచికారీ చేసేటప్పుడు పురుగు మందులు లేదా తెగుళ్ల మందులతో కలిపి పిచికారీ చేయకూడదు. చౌడు నేలల్లో జింకు సల్ఫేట్‌ను దమ్ములో వేయడం కంటే రెండు దఫాలుగా పిచికారీ చేసుకోవడం లాభదాయకం.